నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 18 మార్చి 2025 | పేజీలు 8

## రాష్ట్రపతి ఏర్పాటు చేసిన అల్పాహార విందులో ఎంపీ వేమిరెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన అల్పాహార విందులో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పార్లమెంటు సభ్యులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జగత్ ప్రకాష్ నడ్డా, రామ్మోహన్ నాయుడు, ఇతర ఎంపీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### ఎమ్మెల్యే చొరవతో
## నీటి సమస్యకు పరిష్కారం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ప్రజల నీటి సమస్యకు పరిష్కారం దొరికింది. కొడవలూరు మండలంలోని పాతవంగల్లు పంచాయతీ వడ్డిపాలెం గ్రామంలో ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ పైపులు, తాగునీటి పైపులు ఒకే ప్రాంతం నుంచి వెళ్లడంతో తాగునీటి పైపులు డ్యామేజ్ అయ్యాయి. దాంతో డ్రైనేజీ నీరు.. తాగునీటితో కలవడం వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి.. సత్వరమే స్పందించి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. దాంతో స్పందించిన అధికారులు సోమవారం డ్రైనేజీ వెళ్లేందుకు ప్రత్యేక పైపులు ఏర్పాటు చేశారు. తాగునీటి పైపులకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. దాంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



### రాయలసీమ ఎత్తిపోతలకు
# సమాధి కడుతున్న చంద్రబాబు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కి సీఎంగా వైయస్ జగన్ శ్రీకారం చుడితే, చంద్రబాబు సమాధి కడుతున్నారని వైయస్ఆర్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీమ రైతుల కన్నీటి కష్టాలకు చంద్రబాబు స్వార్థ రాజకీయ ప్రయోజనాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పంపకాల వ్యవహారంలో ఏపీకి కళ్ళముందే అన్యాయం జరుగుతున్నా కూడా తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని అసమర్థుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎప్పుడు సీఎంగా తీసుకుంటున్న నిర్ణయాలు రాయలసీమ రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. వైయస్ జగన్ సీఎంగా ఉండగా రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించాలనే ఆలోచనతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. నేడు చంద్రబాబు దానిని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమ రైతులపై కక్ష తీర్చుకునేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు తాను రాయలసీమ నుంచి వచ్చానని, 15 ఏళ్లు సీఎంగా చేశానని చెప్పుకోవడమే తప్ప, సీమ రైతాంగానికి మేలు చేసే చర్య ఒక్కటి కూడా చేపట్టలేదు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రయత్నించడం లేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతలను అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు -మిగతా 2లో

- సీమ రైతుల కన్నీటి కష్టాలకు చంద్రబాబు అసమర్థతే కారణం
- కేంద్ర సంస్థల ముందు నీటి హక్కులపై వాదనలను వినిపించడంలో విఫలం
- చంద్రబాబు చేతకానితనం రాయలసీమ ఎత్తిపోతల పాలిట శాపం
- తెలంగాణ అక్రమ ప్రాజెక్ట్‌లపై నోరెత్తలేని నిస్సహాయత
- మండిపడ్డ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

### అశ్వ వాహనంపై
## విహరించిన రంగనాథుడు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో సోమవారం మధ్యాహ్నం రంగనాథస్వామికి తిరుప్పాయ్‌న్డదల్ వేడుక నిర్వహించారు. స్వామి అమ్మవార్లను అందంగా అలంకరించి ఈ వేడుకను ఘనంగా





నిర్వహించారు. ఈ వేడుకకు ఉభయకర్తలుగా కిడాంబి వెంకట నరసింహచార్యుల వారసులు వ్యవహరించారు. రాత్రి స్వామివారికి హంస వాహన సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి పేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఉభయకర్తలుగా అట్రవణం కుటుంబం వారు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

### జాప్యం లేకుండా..
## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 303 అర్జీలు
- అర్జీదారులకు భోజన ఏర్పాట్లపై విశేష స్పందన



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు డీఆర్వో ఉదయ భాస్కర్ రావు, డ్వామా పీడీ గంగాభవాని, డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఇవో మోహన్‌రావు ప్రజల నుంచి 303 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు.

**భోజన ఏర్పాట్లపై విశేష స్పందన..**

ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల 02లో

# జాప్యం లేకుండా ప్రజా సమస్యలు పరిష్కరించాలి

*(మొదటి పేజీ తరువాయి)*

నుంచి కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించడం పట్ల విశేష స్పందన లభిస్తోంది. అర్జీదారులకు మధ్యాహ్నం భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, గతవారం నుంచి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అన్న క్యాంటీలకు భోజనం అందించే సుభోజన వారు మంచి రుచికరమైన భోజనాన్ని అర్జీదార్లకు అందించారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో రైతుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి..**

జిల్లాలో ధాన్యం ధరలు రోజురోజుకి తగ్గిపోతున్నాయని, దీంతో రైతులు చాలా నష్టపోతున్నారని, వెంటనే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష రైతు సంఘం నేతలు జిల్లా కలెక్టర్‌కు ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. మిల్లర్లు పుట్టికి రూ.16,500 మాత్రమే ఇస్తున్నారని, తేమశాతం పేరుతో 70 కిలోల ధాన్యాన్ని తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గతవారం రోజులుగా 20 వేల రైతులు ఆరబోసుకుని ఉన్నారని, గోతాలు లేనందున ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మిల్లుకు తీసుకెళ్లేందుకు జీపీఎస్ ఉన్న ట్రాక్టర్లు దొరకడం లేదని, జీపీఎస్ ఏర్పాటు చేసుకుని అది యాక్టివేట్ కావడం లేదని చెప్పారు. ఇంకా ధాన్యం ధరలు తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం తరపున రైతుల సమస్యలు పరిష్కరించి రైతులకు మంచి ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు విన్నవించారు.

**మాజీ సైనికుల భూములను కాపాడండి..**

జిల్లాలో మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన భూములను కొంత మంది ఆక్రమించి మాజీ సైనికులను ఇబ్బందులు పెడుతున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు మహబూబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. చాలా ప్రాంతాల్లో మాజీ సైనికుల భూములను స్థానికులు ఆక్రమిస్తున్నారని, అధికారులు దగ్గరుండి మాజీ సైనికులకు భూములు అప్పగించాలని కోరారు. వెంకటాచలం మండలం చెముడుగుండ గ్రామం కుంకుమపుడి వద్ద దాదాపు 70 ఎకరాలు మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో కొంత భూమి కబ్జాదారుల చేతుల్లో ఉందన్నారు. ఆన్‌లైన్, అడంగళ్‌లో కూడా ఇంకా చాలా మంది మాజీ సైనికుల పేర్లు నమోదు చేయలేదని, వెంటనే మాజీ సైనికుల భూములకు రక్షణ కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేసే వారికి జరిమానాలు విధించండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 20వ డివిజన్ హనుమాన్ జంక్షన్, స్నేహ నగర్, అక్షయ గార్డెన్, వనంతోపు తదితర ప్రాంతాలలో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్ వాసులు ఖాళీ స్థలాలలో వ్యర్థాలు విసిరేయడం, పక్క ప్లాట్లలోకి ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వంటి చర్యలను గుర్తించామని, అలాంటి వారికి జరిమానా, నోటీసులు జారీ చేయమని, అలాగే పెనాల్టీ విధించమని శానిటరీ అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వేసే వారిని గుర్తించి తప్పనిసరిగా జరిమానాలు వసూలు చేస్తామని అపార్ట్‌మెంట్‌వాసులకు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులకు తెలియజేశారు. సీసీ కెమెరాల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అదేవిధంగా భవన నిర్మాణ సమయంలో నిర్మాణ సామాగ్రిని రోడ్లపై డ్రైన్ కాలువలకు అడ్డంగా వేస్తున్నారని, అలాంటి చర్యలను ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు. రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణ సామాగ్రి వేసిన వారికి నోటీసులు జారీ చేసి జరిమానాలు వసూలు చేస్తామని తెలియజేశారు. నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతించిన మేరకు మాత్రమే నిర్మాణాలను చేపట్టాలని, అతిక్రమించిన భవనాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్‌మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్‌మోహన్, ఆర్‌ఐ ఇనాయతుల్లా, సర్వేయర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ఎత్తిపోతలకు సమాధి కడుతున్న చంద్రబాబు

*(మొదటి పేజీ తరువాయి)*

చేస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో వైయస్ జగన్‌కి మంచి పేరొస్తుందనే ఈర్షా ద్వేషాలతో చంద్రబాబు రగిలిపోతున్నారని తెలిపారు. పోలవరం, ఆల్మట్టి ప్రాజెక్ట్‌ల విషయంలోనూ ఇలాగే రాజీపడి రాష్ట్ర రైతాంగానికి తీరని అన్యాయం చేశాడన్నారు. హక్కుగా దక్కిన నీటిని వాడుకోవడానికే తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు రూ.3,825 కోట్ల వ్యయంతో 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. తద్వారా చెన్నైకి 15 టీఎంసీలు సరఫరా చేయడం, ప్రాజెక్టుల కింద 9.6 లక్షల ఎకరాలకు సాగునీరందించాలన్నది లక్ష్యం అన్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ ఎత్తిపోతల పథకంను అడ్డుకునేందుకు చంద్రబాబు అడుగడుగునా కుట్రలకు పాల్పడ్డాడన్నారు. ఎన్జీటీ (చెన్నై) బెంచ్‌లో తెలంగాణ ప్రాంతంలోని రైతులతో టీడీపీ నేతలు అప్పట్లో రిట్ పిటీషన్ దాఖలు చేయించారన్నారు. దీనిపై విచారించిన ఎన్జీటీ పర్యావరణ అనుమతి తీసుకుని, ఎత్తిపోతల పనులు చేపట్టాలంటూ 2020 అక్టోబర్ 29న ఆదేశించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు అవసరాలను సరిగ్గా వివరించకపోవడం, మొదటి నుంచి ప్రాజెక్ట్‌పై వ్యతిరేకతతో ఉన్న చంద్రబాబు నిర్లక్ష్య వైఖరి ఫలితంగా పనులు నిలిపివేయడంతో పాటు అక్కడి పరిస్థితిని పూర్వ స్థితికి తేవాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ గతనెల 27న ఆదేశించిందని వివరించారు. 10 నెలల చంద్రబాబు పాలనలో రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిపోయిందని పేర్కొన్నారు. మనకు హక్కుగా కేటాయించిన 44 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటున్నామని ఈఏసీ ఎదుట సమర్థంగా వాదనలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 798 అడుగుల్లోనే తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని తోడేస్తోందని, 800 అడుగులకు చేరగానే సాగుకు నీటిని విడుదల చేసుకుంటున్నారన్నారు. అయినా కూడా చంద్రబాబు ప్రభుత్వం దీనిపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా చోద్యం చూస్తూ కూర్చుందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచే ఏపీ వాటాకు దక్కాల్సిన నీటిని కూడా తెలంగాణకు యథేచ్ఛగా వినియోగంచుకుంటూ వస్తోందన్నారు. ప్రారంభంలోనే దీనిని అడ్డుకునేందుకు ఆనాటి చంద్రబాబు సర్కార్ గట్టిగా ప్రయత్నించి ఉంటే నేడు ఇటువంటి దుస్థితి ఏర్పడేది కాదన్నారు. చంద్రబాబు చేతకానితనం వల్ల శ్రీశైలంలో 880 అడుగుల గరిష్ట స్థాయికి నీటిమట్టం చేరితే తప్ప పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీకి 44 వేల క్యూసెక్కుల నీటిని తరలించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర రైతుల సాగునీటి అవసరాలపై ఏనాడైనా చంద్రబాబు దృష్టిసారించి ఉంటే కరువుసీమకు సాగునీరు ఎంత విలువైందో అర్థమైందన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి న్యాయంగా ఏపీకి హక్కుగా వాడుకునే నీటి కోసమే ఆనాడు వైయస్ జగన్ సర్కార్ రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కూడా ఆ మేరకు మా వాటా నీటిని హక్కుగా వాడుకుంటామని, పర్యావరణ అనుమతులు వచ్చేలోపు ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని గట్టిగా వాదించి ఉంటే మనకు తీర్పు అనుకూలంగా వచ్చి ఉండేదన్నారు. కానీ ప్రాజెక్టు పూర్తయితే ఎక్కడ వైయస్ జగన్‌కి పేరొస్తుందోననే కుట్రతో చంద్రబాబు రైతుల జీవితాలను ఫణంగా పెట్టారన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను కొనసాగించిందన్నారు. 2014-19 మధ్య ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు వారికి సాగిలాపడిపోయి కృష్టా జలాలకు సంబంధించి రాష్ట్ర హక్కులను హరిస్తున్నా కిమ్మనకుండా ఉండిపోయాడన్నారు. కేసు నుంచి బయటపడేస్తే చాలన్నట్టు వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాడని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా చెన్నైకి నీటిని సరఫరా చేయాలంటే తెలుగుగంగ ప్రధాన కాలువపై ఉన్న వెలిగోడు రిజర్వాయర్ (9.5 టీఎంసీలు), సోమశిల (17.33 టీఎంసీలు), కండలేరు (8.4 టీఎంసీలు) రిజర్వాయర్‌లలో మొత్తంగా కనీసం 35.23 టీఎంసీలు నిల్వ ఉండాలని, అప్పుడే చెన్నైకి 15 టీఎంసీలను సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనికి తోడు రాయలసీమలోని దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటి కోసం 8.6 టీఎంసీలు వెరసి 58.83 టీఎంసీలు శ్రీశైలం నుంచి తరలించాలని ప్రభుత్వానికి జల వనరుల శాఖ అధికారులు ప్రతిపాదించిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీలు తరలించేలా రూ.35,200 కోట్ల వ్యయంతో పాలమూరు-రంగారెడ్డి, రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీలు తరలించేలా డిండి ఎత్తిపోతలను రూ.6,190 కోట్ల వ్యయంతో 2015 జూన్ 10న తెలంగాణ సర్కార్ చేపడితే చంద్రబాబు నోరెత్తడం లేదు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన జలాలు దక్కవని, ఏపీ రైతులు 2021లో ఎన్జీటీ (చెన్నై బెంచ్)ని ఆశ్రయించారు. ఈ కేసులో రైతులతో నాటి వైఎస్సార్‌సీపీ సర్కార్ కూడా జత కలిసింది. ఆ రెండు ఎత్తిపోతలకు నీటి కేటాయింపులే లేవని, వాటి వల్ల శ్రీశైలం, సాగర్‌పై ఆధారపడ్డ ఆయుకట్టుతోపాటు కృష్ణా డెల్టా కూడా నీటి కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతుందని వాదించింది. దీంతో ఏకీభవించిన ఎన్జీటీ తక్షణమే పనులు నిలుపుదల చేయాలని తెలంగాణ సర్కార్‌ను ఆదేశిస్తూ 2021 అక్టోబర్ 29న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను ఉల్లయిఘిస్తూ పనులు చేస్తుండటంతో 2022 డిసెంబర్ 22న తెలంగాణ సర్కార్‌కు రూ.920.85 కోట్ల జరిమానా సైతం విధించింది. అయినప్పటికీ వాటిని తుంగలో తొక్కి తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా పనులు చేస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలంగాణ సర్కార్ ఎలాంటి అనుమతి తీసుకోకుండా 2015లో కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు శ్రీశైలం నుంచి రోజుకు 2 టీఎంసీలు తరలించేలా పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను చేపట్టినా నాటి చంద్రబాబు సర్కార్ అడ్డుకోలేదన్నారు. కృష్ణాబోర్డ్ కేటాయింపులు లేకుండా నీటిని తెలంగాణ వాడుకుంటున్నారు. ఉమ్మడి ప్రాజెక్టు శ్రీశైలం జలాశయం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 841 అడుగుల ఎత్తులో అమర్చారు. శ్రీశైలంలో 880 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో నీరు నిల్వ ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుంది. 854 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 7 వేలు, 841 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 2 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించే అవకాశం ఉంటుంది. శ్రీశైలంలో 841 అడుగుల కంటే దిగువన నీటి మట్టం ఉంటే చుక్క నీటిని కూడా తీసుకోలేం. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా చెన్నైకి 15 టీఎంసీలు, ఎస్సార్బీసీకి 19, తెలుగు గంగకు 29, గాలేరు-నగరికి 38 టీఎంసీల చొప్పున మొత్తంగా 101 టీఎంసీలు సరఫరా చేయాలి. రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశించే వరకు శ్రీశైలం ప్రాజెక్టును ఏపీ, నాగార్జునసాగర్‌ను తెలంగాణ నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. కానీ శ్రీశైలం ఎడమ గట్టు కేంద్రం తమ భూభాగంలో ఉందని తెలంగాణ సర్కార్ దాన్ని తన అధీనంలోకి తీసుకున్నా ఆనాడు చంద్రబాబు సర్కార్ నోరు మెదపలేదు. ఫలితంగా కృష్ణా బోర్డు కేటాయింపులు చేయకున్నా, దిగువన నీటి అవసరాలు లేకున్నా తెలంగాణ సర్కార్ ఏకపక్షంగా శ్రీశైలం జలాశయంలో 798 అడుగుల నుంచే విద్యుదుత్పత్తి చేస్తూ ప్రాజెక్టును ఖాళీ చేస్తూ వస్తోంది. 800 అడుగుల నుంచే నీటిని తరలించేలా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్ట్‌లను తన స్వార్థప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్న చంద్రబాబు రైతుల దృష్టిని మళ్ళించేందుకు బనకచర్ల పేరతో కొత్త డ్రామాకు తెరతీశారు. పోలవరం నీళ్లు బనకచర్లకు తీసుకెళ్తామని, సముద్రంలోకి పోయే వృథా నీటిని సీమకు తీసుకెళ్తామంటే అభ్యంతరం చెప్పొద్దని తెలంగాణాకు సూచిస్తున్నాడు.

మరోవైపు తన శిష్యుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా అభ్యంతరాలు లేవనెత్తేలా కుట్ర చేస్తున్నారు. కేవలం ప్రచారం కోసం మాత్రమే చంద్రబాబు ఈ ప్రాజెక్టును వాడుకుంటున్నాడు. సాగునీటి ప్రాజెక్ట్‌ల విషయంలో చంద్రబాబుకు మొదటి నుంచి ఎటువంటి చిత్తశుద్ధి లేదు. నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టింది వైయస్సార్ అయితే నెల్లూరు జిల్లాకు తానే పొట్టి శ్రీరాములు పేరు పెట్టానని చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నాడు. కానీ మే 22, 2008లో సీఎంగా ఉన్న దివంగత వైయస్ రాజశేఖర్‌రెడ్డి నెల్లూరు జిల్లాను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ జీవో ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు మొదటిసారి సీఎంగా ఉండగానే వైయస్సార్ ఈనిర్ణయం తీసుకున్నారు. ప్రజలు నవ్వుకుంటారనే విచక్షణ లేకుండా చంద్రబాబు అబద్ధాలు చెబితే, దాన్ని కూడా ఒక పత్రిక అచ్చేయడం వారి దివాలాకోరుతనంకు నిదర్శనమని అన్నారు.

# కండలేరు డ్యామ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి

## తెలుగు గంగా ఎస్ఈకి బీజేపీ నాయకులు వినతి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కండలేరును పర్యాటక కేంద్రంగా మార్చడంలో టూరిజం డిపార్ట్మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. తుంగభద్ర డాంను పబ్లిక్ ప్రైవేట్ భాస్వామ్యంతోపర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసినట్లు కండలేరు జలాశయాన్ని కూడా అభివృద్ధి చేయాలి బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ తెలుగు గంగా ఎస్ఈకి వినతిపత్రం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కండలేరు డాం వద్ద పర్యాటక రంగానికి తగినంత స్థలం ఉంది. ఇప్పటికే జింకల పార్కు. ఆలయం. ఖాళీగా తెలుగు గంగ క్వార్టర్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో రిసార్ట్స్. స్విమ్మింగ్ పూల్. బోట్ షికారు. చిన్నపిల్లలు వినోదభరితంగా ఆడుకునే వసతులు కల్పించినట్లయితే రాష్ట్రంలో ముఖ్యమైన పర్యాటక రంగంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. తుంగభద్ర డ్యాంను పర్యాటక రంగంగా మార్చిన తర్వాత ప్రతి ఏడు రెండు కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి వస్తూ ఉంది. కండలేరు జలాశయాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తే పర్యావరణ వనరులు, జీవవైవిద్యం పరిరక్షింపబడుతాయి. స్థానికంగా ఉపాధి కల్పనకు దోహదపడుతుంది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామంతో నైనా పర్యాటక కేంద్రంగా మార్చాలని మిడతల రమేష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి నీలి శెట్టి లక్ష్మణరావు నారాయణ యాదవ్ రాముల యాదవ్ కల్లు భాస్కర్ ఏవి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయంకు కొత్త డివైసులు, స్కానర్ల



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పెన్షన్ల పంపిణీ వివిధ రకముల సర్వేలకు సంబంధించి వివరాలు సేకరించుటలో కీలకంగా ఉండే డివైస్లు, స్కానర్‌లు గత ఐదు సంవత్సరాలు ముందు పంపిణీ చేశారని, అవి రిపేర్లకి గురై సచివాలయ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సర్వేలు చేయట్లో ఇబ్బందుల పడుతున్న విషయంను ప్రభుత్వం వారు గుర్తించి సైదాపురం మండలంకు 140 డివైస్లను కేటాయించారు. అయితే 140 ఎల్-1 స్కానర్ లను సచివాలయ సిబ్బందికి సోమవారం పంపిణీ చేశారు. ఇన్ని రోజులు పనిచేయని స్కానర్లతో సర్వేలు చేయలేక పెన్షన్లు పంపిణీ చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు సచివాలయ సిబ్బంది తమ ఆవేదన వ్యక్తపరిచారు. కొత్త డివైసులు రావడంతో చాలా సమస్యలు పరిష్కరించబడినట్లు సచివాలయ సిబ్బంది ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పరిపాలన అధికారి మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ సునీల్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, గౌతమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంద్రాణి చంద్ర మోహన్ వెంకటేశ్వర్లు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాకానికు లేదు : టీడీపీ నాయకులు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** నిబద్ధత, స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తూ ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పై వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని మండల తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కరియావుల అప్పలనాయుడు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఉదయగిరి ఎమ్మెల్యే అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్‌ను కొట్టి అక్రమంగా సంపాదించాడని వైసిపి నాయకులు ఆరోపణలు చేయడం వారికి మంచిది కాదన్నారు. ఎవరో ఒకరు ఇద్దరు రైతులు దొంగచాటుగా కొట్టుకుంటే దాన్ని ఎమ్మెల్యేకు ఆపాదించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో కాకాని గోవర్ధన్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా జిల్లాలో రైతులకు ఏమి చేశారని ప్రశ్నించారు. ఐదు సంవత్సరాల కాలంలో దోచుకోవడమే ఆయన కార్యక్రమంగా నిర్వర్తించారన్నారు. అటువంటి అవినీతి కలిగిన కాకాని తమ ఎమ్మెల్యే పై బురద జల్లె ప్రయత్నాలు చేయడం ఆయనకు తగదు అన్నారు. ఇటువంటి పిచ్చి రాజకీయాలు చేసే అలవాటు వైఎస్సార్సీపి మా ఎమ్మెల్యేకు లేదన్నారు. ఎమ్మెల్యేగా టికెట్ రాకముందే నియోజకవర్గంలో దాదాపు 50 కోట్ల వరకు ప్రజలకు సంక్షేమం ద్వారా అందించిన ఘనత కాకర్లకే ఉందన్నారు స్వచ్ఛత కలిగిన ఎమ్మెల్యేలు జామాయిల్ చెట్లు కొట్టుకొని నగదు సంపాదించుకున్నాడని ఆరోపణలు చేయడం వారికి హితువు కాదన్నారు. ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి నియోజకవర్గంలో ఎంత పేరు ఉందో తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎలాంటి నిందలు వేస్తే ఉపేక్షించేది లేదని తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షులు పులుగుంట మధుమోహనరెడ్డి, ఉదయగిరి రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్ రెడ్డి, వంటేరు జయ చంద్రారెడ్డి, టీడీపి మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి మాల్యాద్రి, టీడీపి మండల తెలుగు యువత అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి, నాయకులు మాదిరెడ్డి సుబ్బారెడ్డి, జాజుల శివరామయ్య, జాజుల కోటయ్య, సింగమనేని మనోజ్,గద్దె బ్రాహ్మయ్య, ఉన్నంరవి, చైతన్యరెడ్డి, మండల టీడీపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కాగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల సందర్భంగా 144సెక్షన్ అమలు చేశారు. సీఐ జి.గంగాధర్ అన్ని పరీక్ష కేంద్రాలలో పరిశీలించి పర్యవేక్షించారు. ఎస్ఐ జిలాని, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 160మందికి గాను 158 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ఇక్కడ డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా ఏ.మాలకొండయ్య, చీఫ్‌గా అనంతలక్ష్మి వ్యవహరించారు. బాలికొన్నత పాఠశాలలో 72మందికిగాను అందరూ హాజరయ్యారు. సెయింట్ మేరీస్ హై స్కూల్‌లో 156మందికి గాను 155మంది హాజరు కాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. శ్రీ చైతన్య హై స్కూల్‌లో 159మందికి గాను 157మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. శ్రీనివాసా హై స్కూల్‌లో 126మందికి గాను 124మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్ హాజరయ్యారు. జూనియర్ కాలేజీ సెంటర్ లో 132మందికి గాను అందరూ హాజరయ్యారు. స్థానిక డిప్యూటీ డీఈవో జానకిరామ్ పరీక్షలను పర్యవేక్షించారు.

వినియోగదారుల హక్కులపై..

# అవగాహన పెంచుకోవాలి

- సామజికవేత్త మాలకొండారెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** సమాజంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని లోకసత్తా ఉద్యమ నమస్త రాష్ట్ర కమిటీ సభ్యుడు యమ్.మాలకొండారెడ్డి కోరారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కొరకు చట్టాలు వచ్చి మూడు దశాబ్దాలు దాటినా అధికారుల అలసత్వం వలన ఇప్పటికీ వినియోగదారులు మోసపోతున్నారని ఆవేదన చెందారు. నేడు ఎక్కడ చుసిన తుకాలలో తేడాలు, కలితిల జోరు, ధరలలో వ్యత్యాసం వలన వినియోగదారులు నిలువునా మోసపోతున్నారని తెలిపారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, వినియోదరునికి నాణ్యమైన వస్తువులు అందుతాయని, అలాగే అధికారులలో అవినీతి తగ్గుతుందని తెలిపారు. ముఖ్యంగా వినియోగదారులు హక్కులతోపాటు భాధ్యతలు కూడా తెలుసుకుని అన్యాయాలను అవినీతిని ప్రశ్నించినప్పుడే వినియోగదారుల రక్షణ చట్టం ప్రయోజనాలు ప్రజలకు అందుతాయని తెలిపారు. ప్రతి వినియోగదారుడు వస్తువులను కొనేటప్పుడు రసీదులను తీసుకోవాలని కోరినారు. నష్టపోయిన వినియోడాగారుడు, వినియోదరుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందాలని కోరారు. స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి వినియోగదారులను చైతన్యపరిచి వినియోగదారుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు జరగడానికి నిరంతరం కృషి చేయాలనీ మాలకొండారెడ్డి కోరారు.

## పరీక్ష కేంద్రాల వద్ద మండలాధికారులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** పదో తరగతి పరీక్షల నిమిత్తం మండల కేంద్రమైన మర్రిపాడులో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. తొలి రోజున ఆ కేంద్రాల వద్దకు మండలాధికారులు చేరుకొని పర్యవేక్షించారు. మండల ఇన్చార్జి తహసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, ఎంఈఓ ధనలక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసరావులు పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తూ విద్యార్థులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష సమయం 9:30 గంటలకు అయినప్పటికీ ఎనిమిదిన్నర గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొని పరీక్షలు రాయడం జరిగింది. ఏది ఏమైనాప్పటికీ తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

## మర్రిపాడులో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున రెండు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి పకడ్బందీగా నిర్వహించారు. వాటిలో ఒకటి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెండవది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించారు. అయితే తొలిరోజు ముగ్గురు విద్యార్థులు గైరహాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 104 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 171 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతోపాటు ఆరోగ్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

# మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అవగాహన

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తాళ్లపూడి గ్రామపంచాయతీలో సోమవారం మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చీఫ్ రీజినల్ మేనేజర్ ఆదినారాయణ స్వామి మాట్లాడారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని అందివ్వాలి కలుషితం లేని రసయనిక ఎరువుల ద్వారా ఆరోగ్యం దెబ్బ తింటుంటిదని సేంద్రీయ వ్యవసాయం ద్వారా కాలుష్యం తగ్గించుకోవాలి ఆయన అన్నారు. సేంద్రీయ ఎరువులు విరివిగా వినియోగించాలి రైతులు కు అవగాహన కార్యక్రమం పేర్కొన్నారు. రసాయన ఎరువులతో పండించిన ఆహార పదార్థాలు స్వీకరించడం వలన అనారోగ్య సమస్యలు అధికంగా వస్తున్నాయని, సేంద్రియ వ్యవసాయంతో పండించిన పంటల ద్వారా మంచి ఆరోగ్యకరమైన సమాజం తయారవుతుందని తెలిపారు అనంతరం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం వలన కలిగే ప్రయోజనం వివరించారు. అగ్రికల్చర్ ఆఫీసర్-జోత్స్నరాణి మాట్లాడుతూ.. కరోనా తర్వాత ప్రజలలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెరిగిందని చెప్పారు. రైతులు అవసరమైన మోతాదులో రసాయనిక ఎరువులు వాడాలని, సేంద్రియ ఎరువులు, నానో యూరియా, నానో డిఏపీని విరివిగా వినియోగించాలన్నారు. సేంద్రియ వ్యవసాయ పంటల వల్ల మన భవిష్యత్తుకే కాకుండా రాబోయే తరాల వారికి కూడా మంచి చేసిన వారమవుతామని, ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించిన వారమవుతామని వివరించారు. మద్రాస్ ఫెర్టిలైజర్స్ యూరియాతోపాటు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని భూ సారాన్ని పెంచి, అధిక దిగుబడినిచ్చే సేంద్రియ ఎరువులను కూడా తయారు చేస్తోందని చెప్పారు. రైతులు తొందరగా పంటలు



రావడానికి రసాయన ఎరువులు, మందులు వాడటం వలన భూసారం తగ్గి బీడు భూములుగా మారే ప్రమాదం ఉందన్నారు. భూసారాన్ని పెంచేందుకు మద్రాస్ ఫెర్టిలేజర్స్ తయారు చేస్తున్న విజయ ఆర్గానిక్, విజయ సిటీ కంపోస్టు, విజయ ప్రోమ్, విజయ నీమ్ తదితర ఉత్పత్తులను గురించి రైతులకు అవగాహన కల్పించారు. నెల్లూరు కెవికె సీనియర్ శాస్త్రవేత్త డా. శివ జ్యోతి, విజయకుమార్ మాట్లాడుతూ.. రసాయన ఎరువులు వాడటం వలనమట్టిని, నీటిని, గాలిని కలుషితం చేస్తున్నామని చెప్పారు. రసాయన ఎరువులు వాడకుండా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం ద్వారా పండించాలన్నారు. అదేవిధంగా సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు. పాటించండి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ ఎల్ అడిషనల్ మేనేజర్ రాము, తాళ్లపూడి గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసులు, మండలంలో అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు, తాళ్లపూడి, మామిడిపూడి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెల్పింగ్ హార్ట్స్ ఆర్థిక సాయం పై హర్షం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగర మండలం పడమటి కమ్మంపాడు గ్రామానికి చెందిన హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ టీం దాతృత్వం చాటుకుంది. గ్రామంలోని హరిజనవాడకు చెందిన నాగిపోగు తిరుపాల్ కుటుంబానికి, అలాగే వడ్డె పాలెంకు చెందిన మల్లి నాగేశ్వరరావు కుటుంబానికి మొత్తం 50వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఇరువురి కుటుంబ పెద్దలు ఒకరు హార్ట్ ఎటాక్ తోను, మరి ఒకరు యాక్సిడెంట్ వలన మృతి చెందారు. కుటుంబ పెద్దలను కోల్పోయి, పిల్లల విద్యకు, జీవనోపాధికి విఘాతం కలిగిందన్న పరిస్థితి స్పందించిన అసోసియేషన్ వారి కుటుంబాలకు వెళ్లి నగదును అందజేశారు. నిరాశ్రయులైన, ఆపదలో ఉన్న, నిరుపేదలైన వారి యెడల గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా హెల్పింగ్ హార్ట్స్ సంస్థ చేస్తున్న దాతృత్వం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. కార్యక్రమంలో లాయర్ చెన్నయ్య, వ్యవస్థాపకులు ఆర్. వెంకట రమణారెడ్డి, సంస్థ కార్యదర్శి కత్తి పెంచలయ్య, సభ్యులు బొమ్మిల్ల మురళి, ఏటూరు సుధాకర్, పొదిలి చిన్న, షేక్ సందాని, జూలపల్లి రవి, వార్డు మెంబర్ సత్యాల పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఐదు మంది గైహాజరు

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను రెండు చోట్ల పరీక్షలను నిర్వహించడం జరిగింది. మొదట సైదాపురం జడ్పీ హైస్కూల్ రెండవ సెంటర్ కలిచేడు జడ్పీ హైస్కూల్, మండలంలోని మొత్తం పదవ తరగతి విద్యార్థుల 272 కాగా అందులో 267 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. సైదాపురం విద్యార్థులు సంఖ్య 158 కాగా అందులో 154 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. అదేవిధంగా కలిచాడు జడ్పీ హైస్కూల్ యందు విద్యార్థుల సంఖ్య 114 కాగా అందులో 113 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని మండలంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల్లో మొత్తం 272 కాగా అందులో ఐదు మంది విద్యార్థులు మాత్రమే హాజరు కాలేదని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ అధికారులు తెలియజేశారు. అంతేకాకుండా పరీక్షలు కూడా చాలా ప్రశాంతంగా జరిగాయని ఇన్విలేషన్ వేసిన అధికారులు కూడా చాలా స్ట్రిక్టుగా ఉండి పరీక్షలు నిర్వహించడం



జరిగిందని, విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంతో 8 గంటల సమయంలోనే పరీక్షా కేంద్రాల వద్ద తమ రోల్ నెంబర్‌ను చూసుకుంటూ తమ సీటు ఎక్కడా అని ఎంతో ఉత్సాహంతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని పరీక్ష కేంద్రాల చీఫ్ అధికారులు తెలిపారు.



# వారాంతపు సమీక్ష సమావేశంలో కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో సోమవారం ఇంజనీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాల వారితో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎల్ అండ్ టీ ఇంజనీరింగ్ కంపెనీ వారికి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కనెక్షన్లు వేగవంతంగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని ప్రతినిధులకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా మెగా ఇంజనీరింగ్ వారికి నగర ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందజేయుటకు గాను పాత కనెక్షన్ల ద్వారా కాకుండా నూతన జోనల్ విధానం ద్వారా నీటి సరఫరాను పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఆప్షన్ మూడు నుంచి ఒకటికి అదనపు ఫైనాన్స్ అసిస్టెన్స్ మంజూరు కొరకు యాప్ ద్వారా అప్లోడ్ చేయవలసిందిగా, అలాగే స్టేజ్ కన్వర్షన్ త్వరగా అయ్యేలా, నీటి చార్జీలు నిర్దేశించిన లక్ష్యాలను వసూలు చేయవలసినదిగా ఎమినిటీస్ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ వైఓ నందన్, ఎస్ఈ రామ్ మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేటలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని జడ్పీ హైస్కూల్లో పరీక్షా కేంద్రంలో 104 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొలిరోజైనా తెలుగు పరీక్షకు గాను 103 మంది పరీక్షకు హాజరైనట్లు డిపార్ట్మెంటల్ అధికారి చీఫ్ తెలిపారు అలాగే మోడల్ పాఠశాలలో 144 మంది విద్యార్థులకు గాను 140 మంది పరీక్షకు హాజరైనట్లు డిపార్ట్మెంటల్ అధికారి చీఫ్ తెలియజేశారు పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయిన తొలి రోజున కావడంతో ఉదయాన్నే 8:30 కల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద కు చేరుకున్నారు మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది ఏఎస్ పేటలోని రెండు పరీక్షా కేంద్రాల వద్ద ఏఎస్పేట ఎస్ఐ ఏ.సైదులు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

## పట్టపగలు ఇంట్లో చోరీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం నందిగుంట గ్రామంలో వివిఆర్ నగర్లో ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కీటికి కమ్ములను కత్తిరించి కిటికీ ద్వారానేరుగా ఇంట్లోకి వెళ్లి బీరువాలోని లాకర్లో ఉన్న 11సవర్ల బంగారు నగలు లక్ష రూపాయలు నగదు దొంగలించారని ఇంటి యాజమాన్యం షేక్ ఖాదర్‌బాషా బేబీజాన్‌లు ఆవే దన వ్యక్తం చేశారు. వారిద్దరూ పనిమీద బయటికి వెళ్లారని ఇది తెలుసు కున్న దుండగులు ఈ సంఘటనకు పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయం పై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. వెను వెంటనే సంఘటన స్థలానికి సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ వీర ప్రతాప్ చేరుకుని స్క్వాడ్ ద్వారా పరిశీలించి, వేలిముద్రలగుర్తులు సేకరించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సైబర్ నేరాలు పట్ల జాగ్రత్త వహించాలి




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సైబర్ నేరాలు పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని బ్రహ్మదేవి గ్రామపంచాయతీ అధికార పార్టీ నాయకులు కొత్తపల్లి రమేష్ కుమార్ అన్నారు. సోమవారం గ్రామ సచివాలయంలో డిపాజిటర్స్, ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రాం కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ ఫర్ వెల్ఫేర్ యాక్టివ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సాగించారు. అనంతరం ఈ కార్యక్రమం గురించి కొత్తపల్లి మాట్లాడారు. బ్యాంకు ఖాతాలో ఆర్థిక లావాదేవీపట్ల జాగ్రత్తలు ఉండాలన్నారు. బ్యాంక్ అధికారుల సహకారంతో పొదుపు పాటిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారపార్టీ నాయకులు విష్ణువర్ధన్ రావు, సర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి లెనిన్, పొదుపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బీదకు గూడా అభినందనలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్సీ బీద రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి వింజమూరు మండల మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి పుష్ప గుచ్చం అందజేసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి విష్ చేయగలరని కోరారు.

# నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు

## - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను నిషేధిస్తున్నట్లు కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని ఇకనుంచి కచ్చితంగా ఆపివేయాలని కమిషనర్ హెచ్చరించారు. క్రమం తప్పకుండా ప్లాస్టిక్ ఉత్పత్తుల దుకాణాలపై దాడులు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలకు భారీ స్థాయిలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. జరిమానాలు విధించడంలో వార్డు సచివాలయ కార్యదర్శులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం ద్వారా వివిధ మాధ్యమాల ద్వారా అందుకున్న ప్రజా సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం అందించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నిటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-11, హౌసింగ్-16, టౌన్ ప్లానింగ్-15, రెవెన్యూ-4, పబ్లిక్ హెల్త్-7, మొత్తం-59 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ పద్మజ, సెక్రటరీ శ్రీలక్ష్మి,మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫోర్ పిల్లర్స్ ఫిలిం హౌస్ సినీ ఆడిషన్స్ సద్వినియోగం చేసుకోండి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో స్థానిక కేవీయార్ పెట్రోల్ బంక్ దగ్గర లోని చెన్నై హాస్పిటల్స్ ఇంఫార్మేసన్ సెంటర్ ఆవరణలో ఫోర్ పిల్లర్స్ ఫిలిం హౌస్ నిర్మాణ సంస్థలో ప్రొడక్షన్ నంబర్ వన్ చిత్ర యూనిట్ సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ముక్కు రాధా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. తమ బ్యానేర్ పై నెల్లూరు పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుప తలపెట్టామని అందులో భాగంగా జిల్లా వాసులకు తమ సినిమాలో నటి నటులుగా వివిధ పాత్రలలో అనుభవం గల కళాకారులను ఎంపిక చేసి వారికి అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే వారందరు ముందు ముందు సినీ పరిశ్రమలో ఎదిగేందుకు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మార్చి 17, 18, తేదీలలో జరుగుతున్న ఆడిషన్‌లో పాల్గొని తమ టాలెంటును నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు ప్రవీణ్ బండ, చిత్ర డీఓపి వెంకీ దొమ్మరాజు, చిత్ర కో డైరెక్టర్ శ్రీనివాస్ రాయి, కో ప్రొడ్యూసర్ నవీన్, ఇతర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య యాత్రలు జయప్రదం చేయండి : ముత్యాల గుర్నాధం




**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగు తున్న ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ముత్యాల గురునాథం పిలుపునిచ్చారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెం పార్క్ సెంటర్లో యాత్రలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు ఎన్నికల హామీలను నెరవేర్చలేదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించక పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు. ఒకవైపు రైతులు పంట కోసుకొని కళ్ళాల్లో ధాన్యం పెట్టుకుని ఉంటే, కొనుగోలు కేంద్రాలు నుండి ప్రభుత్వం ఒక్క గింజ కూడా ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు అని అన్నారు. మిల్లర్లు, దళారులు రైతులను దోచుకుంటున్నారని 2వేల నుండి 3వేల రూపాయలు వరకు తగ్గించి కొంటున్నార్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విధానాలను వలన ఈ పరిస్థితులు వచ్చిందని తమ అసమర్థతను వారిపైనే నెర్చుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఏ ఒక్క పథకం కూడా అమలు కాలేదన్నారు. మహిళలు, నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగుల కోటి ఆశలతో ప్రభుత్వం వైపు చూస్తున్నారు అని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ప్రజాపాలన గాలికి వదిలేసి వైసిపి పాలనలో విధ్వంసం పైనమాటలు చెబుతున్నారని ఆయన అన్నారు. మండల కార్యదర్శి గండవరం శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న ఉచిత బస్సు ప్రయాణం, నెలకి ఒక్కొక్కరికి 1500 రూపాయలు, విద్యార్థులకు ఇస్తామన్న విద్యా దీవెన, రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రజా పాలన గాలికి వదిలేసి ఆయన బిజెపి సిద్ధాంతాలను ప్రచారంలో తీసుకొని పోయేదానికి ప్రయత్నించడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, సిపిఎం పార్టీ నాయకులు పుత్తేటి మల్లికార్జున, తంబి రమణయ్య, శ్రీనివాసులు, మద్దిశెట్టి సురేష్, గరికపాటి సురేష్, షేక్ జానిబాష, షేక్ మునీర్ అహ్మద్, షేక్ ఖాదర్ భాషా సిపిఎం పార్టీ, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ బీదను కలిసిన టీడీపీ నాయకులు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్సీ బీద రవిచంద్రను వింజమూరు తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శి పట్టణ అధ్యక్షులు కోదూరు నాగిరెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఉదయగిరి నియోజకవర్గం పట్టణాభివృద్ధి కూడా జరిగే విధంగా కృషి చేయగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు మాజీ ఎఫ్‌సీఐ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ పి.చంచల బాబు యాదవ్ శివ తదితరులు ఉన్నారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి ధన్యవాదాలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద-హోమియోపతి కౌన్సిల్ బోర్డు సవరణ బిల్లు సోమవారం అసెంబ్లీ ఆమోదం పొందింది. ఎన్నో సంవత్సరాలుగా ఈ బోర్డు బిల్లు పెండింగ్‌లో ఉంది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రి సత్యకుమార్ ఆయూష్ శాఖ మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ శాఖలో ఉన్న అనేక సమస్యలు మీద నివేదిక తెప్పించుకొని పరిష్కారం దిశగా అడుగులు వేశారు. ఆ క్రమంలోనే ఆంధ్ర ఆయుర్వేద-హోమియోపతి కౌన్సిల్ బోర్డు సవరణ బిల్లు అసెంబ్లీ లో ఆమోదం కోసం కృషి చేశారు. బీజేపీ డాక్టర్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ మహేంద్ర యాదవ్, మెడికల్ ప్రాక్టీనిషనర్ అసోసియేషన్ ఫౌండర్ డాక్టర్ భాను ప్రకాష్, విశ్వ ఆయుర్వేద సెక్రటరీ డాక్టర్ నవీన్ ఆంధ్ర ఆయుష్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ ఈ బిల్లు ఆమోదం కోసం పలు మార్లు మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మంత్రికి ఆయూష్ డాక్టర్ల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చెంచు కృష్ణ



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం.చెంచుకృష్ణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చెంచు కృష్ణ సామాన్య న్యాయవాదిగా వృత్తిలో ప్రవేశించి క్రమశిక్షణతో సీనియర్ న్యాయవాది దగ్గర జూనియర్‌గా ఉంటూ అనేక సివిల్ క్రిమినల్ కేసులను వాదించారు. అందరితో స్నేహపూర్వకంగా మెలిగే చెంచు కృష్ణను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడం పట్ల సీనియర్ జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## నరసింహస్వామి వారికి గొడుగుల వితరణ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పెంచలకోన లో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి వింజమూరు జై భీమ్ నగర్ కాలనీకి చెందిన స్వామి భక్తులు సాధం నరసింహులు లలితమ్మ ప్రశాంత్ మౌనిక కళ్యాణ్‌లు గొడుగులను వితరణ చేశారు. గతంలో మీరు స్వామివారికి మొక్కుకున్న కారణంగా తమ మొక్కులు తీర్చుకున్నారు వారు అనుకున్న కోరికలు తీరినందున స్వామివారికి మనసారా ఈ గొడుగులను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా శ్రీ పెంచల నరసింహ స్వామి విరాజిల్లుతున్నాడని వారు తమ భక్తిని ప్రకటించుకున్నారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో శ్రీ నేతాజీ వికాస్ కేంద్రంగా 170 మంది మంజూరు గాక 170 మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య పాఠశాలకు 182 మంది మంజూరు కాక 180మంది హాజరై ఇద్దరు గైర్హాజరయ్యారు. అలాగే నారాయణ పాఠశాలలో 181 మంది మంజూరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు 179మంది పరీక్షకు హాజరయ్యారు .ఉన్నత పాఠశాలకు 160 మంది మంజూరు కాగా 160 మంది హాజరయ్యారు ఎవరు గైర్హాజర్ కాలేదని ఆయా కేంద్రాల చీఫ్ అధికారులు తెలియజేశారు. విద్యార్థులు ఉదయాన్నే సమయం మించిపోకుండా ఆయా పరీక్షా కేంద్రాలకు హాజరై తమ నంబరు ఏ రూమ్‌లో ఉందో చూసుకునేందుకు ఉత్సాహపడ్డారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

నిత్య దినపత్రిక

# సూర్య

www.suryaa.com



# జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు మరింత విస్తృత ఏర్పాట్లు

- మద్దతు ధర కంటే తక్కువకు కొంటే దళారులు, మిల్లర్లపై కేసులు
- కొనుగోలు కేంద్రాల్లో సరిపడ గన్నీ బ్యాగులు, జీపీఎస్ వాహనాలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- రైతులకు సమస్యల పరిష్కారానికి కంట్రోలు రూం నెంబరు 8520879979 : జాయింట్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు మరింత విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ చెప్పారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలులో ధాన్యం సేకరణపై జేసీ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏర్పాటుచేసిన 300 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు సుమారు 11వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో అధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారన్నారు. మద్ధతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎవరైనా రైతులను ప్రలోభపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నామని చెప్పారు. కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు ఉండకూడదని మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి అమలు చేసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. 25వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 40కోట్ల మేర మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు అందజేసి వున్నారని, ఈ విషయంలో రైతులు ఎలాంటి అపోహాలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. 3.50లక్షల గన్నీబ్యాగులు అందుబాటులో వున్నాయని, ధాన్యం సేకరణ ఎక్కువగా వున్న కేంద్రాల్లో గన్నీ బ్యాగులను ముందుగా సిద్ధం చేసి ఉంచుతున్నట్లు చెన్నారు. లారీ, ట్రాక్టర్ అసోసియేషన్లతో సంప్రదించి ప్రస్తుతం ప్రభుత్వం అనుమతించిన రేట్ల మేరకు వాహనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. 250 లారీలు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాటుచేశామని, ఇవి ఎట్టిపరిస్థితిలో జిల్లా దాటివెళ్లకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. వాహనాలను పర్మినెంట్ జిపిఎస్ కాకుండా టెంపరరీ మాగ్నటిక్ జీపీఎస్‌ను ఏర్పాటు చేసేందుకు ఏజెన్సీని ఎంపిక చేసినట్లు చెప్పారు. దీంతో జీపీఎస్ వాహనాల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. మన జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ప్రకాశం జిల్లా నుంచి 10మంది రైసుమిల్లర్లను కొనుగోలు కేంద్రాలకు అనుసంధానించినట్లు చెప్పారు. ఈ మిల్లుల నుండి ఒక్కొక్క మిల్లుకు 500 మెట్రిక్ టన్నులు సేకరించేలా ప్రతిరోజూ 5000 మెట్రిక్ టన్నుల లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. ఇంకా ఇతర జిల్లాల నుంచి ఆసక్తి గల మిల్లర్లను అనుసంధానిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లోనే డబ్బులను కూడా ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 50శాతం కోతలు పూర్తయ్యాయని, మరో రెండువారాల్లో మరో 50శాతం కోతల పూర్తికానున్న నేపథ్యంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా వుందని చెప్పారు. రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తూ కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, రైతులందరూ దళారుల ప్రలోభాలకు లొంగకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం నెంబరు 8520879929ను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జున్‌రావు పాల్గొన్నారు.

# కొండ బిట్రగుంట ఆలయ ఈవో పై చర్యలు తీసుకోవాలి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న ఈవో రాధాకృష్ణపై చర్యలు తీసుకోవాలని స్థానిక గ్రామస్తులు టిడిపి సీనియర్ నాయకులు రావి విజయ్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో రథం ఘటనపై ఈవో అలసత్వానికి నిరసనగా సోమవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ యాదవ్ మాట్లాడుతూ.. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈవోగా పనిచేస్తున్న రాధాకృష్ణ అహంకార ధోరణిగా వ్యవహరిస్తున్నాడని, బ్రహ్మోత్సవాలకు నూతనంగా సిద్ధం చేసిన రథాన్ని ట్రైలర్ వేయకుండా బ్రహ్మోత్సవాలలో దేవుని ఊరేగించేందుకు ముందుకు తీయడంతో రథం మొరయించిందని తెలిపారు. 2023వ సంవత్సరంలో బ్రహ్మోత్సవాల్లో పాత బిట్రగుంట వద్ద రథం ఒరిగిన విషయం తెలిసి నిర్లక్ష్యంగా అహంకారంగా ఎవరి సలహాలు తీసుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఈవో సోదరుడు తులసి రామ్ కొండ పై పెత్తనం చేస్తున్నాడని అతనిపై కూడా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ బిట్రగుంట, పాత బిట్రగుంట గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పర్వతరెడ్డి ఎమ్మెల్సీగా రెండేళ్లు పూర్తి.. సంబరాలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైసీపీ సిటీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అఖండ విజయం సాధించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, మిత్రులు అభిమానులు, కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణసంచ పేల్చి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రాకతో కార్యాలయం వైసీపీ నగం కిక్కిరిసింది. కార్యకర్తల సందడితో పార్టీ పరిసర ప్రాంతాలన్ని కోలాహాలంగా మారాయి. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి విద్యాసంస్థలు స్థాపించి నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అద్భుతమైన సేవలందిస్తున్నారని వారు తెలిపారు. ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు ఒక చరిత్ర అని పేర్కొన్నారు. నెల్లూరు రెడ్ క్రాస్ చైర్మన్‌గా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సేవలందిస్తూ నెల్లూరు రెడ్‌క్రాస్‌కు దేశస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఏ రంగంలో అడుగుపెట్టిన ఆ రంగానికి వన్నె తెచ్చే విధంగా ఆయన సేవలందిస్తున్నారని కొనియడారు. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సేవలను మెచ్చి.. వైయస్ జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. సిటీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ప్రజల పట్ల ఆయన చూపుతున్న ఆదరణకు ప్రజల్లో ఎనలేని అభిమానం సంపాదించుకున్నారని తెలిపారు. సిటీ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సంతరించుకోవడం ఖాయమని తెలిపారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా తామంతా పనిచేసి మళ్లీ ఈ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు.




# బీపీటీ ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలి

- అసెంబ్లీలో ప్రభుత్వానికి వినతి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో బీపీటీ రకం ధాన్యం పండించిన రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) లభించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అసెంబ్లీలో విన్నవించారు. భిన్నమైన నెల్లూరు వ్యవసాయ సీజన్ నెల్లూరు జిల్లాలో వ్యవసాయ సీజన్ ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొంత భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం రైతులు మొదటి పంట చేతికొచ్చి వరికోతను చేపట్టారు. జిల్లాలో ప్రధానంగా బీపీటీ, కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకాల ధాన్యం సాగుచేశారు. అయితే, కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకాల ధాన్యానికి సరైన ధర లభిస్తున్నప్పటికీ, బీపీటీ పండించిన రైతులు కనీస మద్దతు ధరకు నష్టపోతున్నారు.

**ధరల్లో భారీ తేడా.. రైతులకు నష్టం :** ప్రస్తుతం కనీస మద్దతు ధర పుట్టికి రూ.19,700 ఉండగా, రైతులు బీపీటీ ధాన్యాన్ని రూ.16వేలు, రూ.17 వేల కే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల రైతులకు పుట్టికి రూ.2వేలు, రూ.3వేలు నష్టం, ప్రతిఎకరాకు రూ.12వేల నష్టం వస్తోంది.

**ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి :** జిల్లా వ్యాప్తంగా సుమారు 1.50 లక్షల ఎకరాల్లో బీపీటీ రకం పంట సాగుచేశారు. అయితే, కనీస మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 2018లో చంద్రబాబు హయాంలో రైతులకు మద్దతు 2018లో నెల్లూరు జిల్లాలో బీపీటీ ధాన్యంలో విరుగుళ్ల సమస్య తలెత్తినప్పుడు, రాత్రి 11 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడిని కలిసి క్వింటాలుకు రూ.200 బోనస్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పుడూ ప్రభుత్వం వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయీస్ శాఖ మంత్రులు కలిసి తక్షణమే చర్యలు తీసుకుని, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచల మండలంలో పదో తరగతి పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. మండలంలోని 7పరీక్షా కేంద్రాల్లో మొత్తం 922 మంది విద్యార్థులకు గాను 914 మంది హాజరయ్యారు, 9 మంది గైహాజరయ్యారు. ప్రైవేట్‌గా పరీక్ష రాసే 3 మంది విద్యార్థులు పూర్తి హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు స్టేట్ అబ్జర్వర్ రవీంద్రనాథ్ రెడ్డి మండలంలోని రవీంద్ర భారతి స్కూల్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాలను సందర్శించారు. అలాగే, మండల విద్యాశాఖ అధికారి కె.మధుసూధన్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో కలిసి మండలంలోని అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు క్రమశిక్షణతో, ప్రశాంత వాతావరణంలో అధికారులు మాట్లాడుతూ.. పరీక్షలు పూర్తిగా క్రమశిక్షణతో, నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయి అని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిగా చేయబడినట్లు తెలిపారు.

# పంటలకు మద్దతు ధర కల్పించాలని వినతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పసుపు, వరి పంటలకు మద్దతుధర కల్పించి రైతులను ఆదుకోవాలని సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు తహసిల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలకు నిమిగుబడి చేతికందిన సమయంలో ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బహిరంగ మార్కెట్లో ఆయా పంట దిగుబడుల ధరలు క్షీణించడంతో రైతులకు పెట్టుబడులు కూడా రాడన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం క్వింటా ధాన్యంకు రూ.2,700లు, పసుపుకు రూ.17వేల చొప్పున మద్దతు ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు పాల్గొన్నాడు.

**నీరు విడుదల చేయాలి :** మండలంలోని గంగులవారి చెరువుపల్లి చెరువు కింద సాగులో పంటలకు నీరు విడుదల చేయాలని సోమవారం రైతు మధుసూదన్ జలవనరుల శాఖ ఏఈ వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులో చేపలు పెంపకం చేపట్టి పంటలకు నీరు వదలకుండా అడుకుంటున్నారన్నారు. దీంతో పంటలు ఎండుదశకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయన కోరారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులు విలువైన సూచనలను అందించండి

## - ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగర నియోజకవర్గం 117-నెల్లూరు సిటి పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి విలువైన సూచనలను ఆహ్వానిస్తున్నామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సూర్యతేజ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వివిధ అంశాలపై తగు చర్యలు తీసుకోవడానికి సోమవారం సమావేశం నిర్వహించినట్లు తెలియజేశారు. ఎస్ఎస్ఆర్-2025 ఎలక్టోరల్ రోల్ సవరణలపై చర్చలు జరిపేందుకు ఎన్నికల సంఘం చట్టపరమైన, అధికారుల జవాబుదారీతనానికి కట్టుబడి ఉందని వివరించారు. ఎస్ఎస్ ఆర్-2025కి సంబంధించి పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై పరిష్కారం అందించామని తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు సెలవులో ఉన్నట్లయితే లేదా బదిలీ అయినట్లయితే ఆ పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి తక్షణమే ప్రత్యామ్నాయ బీఎల్ఓలను నియమించాలని నెల్లూరు అర్బన్ తహశీల్దార్‌ను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో 800 నుండి 1400 మంది ఓటర్లు ఉండేలా, ప్రతి ఓటరు వారి నివాసానికి 2 కిమీలోపు ఉండేలా పోలింగ్ స్టేషన్లు చేపట్టబడతాయని, ఓటర్లను పోలింగ్ స్టేషన్‌లకు తరలించడం ద్వారా పోలింగ్ స్టేషన్‌లను హేతుబద్ధీకరించేందుకు వచ్చే రెండు నెలల్లో సమగ్ర కసరత్తు చేపట్టనున్నట్లు వివరించారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే క్రమంలో ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. నియోజకవర్గంలో రాజకీయాల ద్వారా నియమించబడిన బీఎల్ఎలు తమ సంబంధిత బీఎల్ఓలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత పోలింగ్ స్టేషన్‌ల జాబితాలలో సహాయం అందించాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని బీఎల్ఓలందరికీ శిక్షణా సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి సిహెచ్ ధనుంజయ్, తెలుగుదేశం పార్టీ నుంచి చాట్ల నరసింహారావు, ఎస్‌కే ఇంతియాజ్, మామిడాల మధు, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్.ప్రవీణ్ కుమార్, జనసేన పార్టీ నుంచి ఎస్.కె ఆలియా, ఎస్.అజయ్ బాబు, ఎం.హైమావతి, భారతీయ జనతా పార్టీ నుంచి టి. నవీన్ కుమార్, ఎం. రాజేష్, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కత్తి శ్రీనివాసులు, బహుజన సమాజ్ పార్టీ నుంచి బి. శ్రీరామ్, 117-నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

# కామధేను ప్రాజెక్టు అభివృద్ధికి చర్యలు చేపట్టండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలోని కొండాపురం మండలం చింతలదేవిలో ఏర్పాటు చేసిన కామధేను బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం అసెంబ్లీలో వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2,500 ఎకరాల విస్తీర్ణంలో 1918లో ఫామ్ ఏర్పాటు చేయగా అందులో 1985లో కాంపొజిట్ లైవ్ స్టాక్ ఫామ్ ప్రారంభించారన్నారు. అందులో నెల్లూరు జోడిపి రకం గొర్రెలు 958, ఒంగోలు జాతి ఆవులు 368 ఉన్నాయ ఉన్నారు. 2015 మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారంతో జాతీయ కామదేను ప్రాజెక్టుగా రూపాంతరం చెందిందన్నారు. దేశంలోనే ఈ ప్రాజెక్టు రెండోదన్నారు. 420 బ్రీడ్స్ ఉత్పత్తి చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఒంగోలు జాతి బ్రిడ్‌ను 2 మిలియన్స్ డాలర్సకు బ్రెజిల్‌కు అమ్మకం చేయడం జరిగిందన్నారు. అయితే ప్రాజెక్టు అంచలంచెలంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ప్రధానంగా ప్రాజెక్టు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతుందన్నారు. రూ.3.5 కోట్లు నిధులు కేటాయిస్తే సమీప రాళ్లపాడు జలాశయం నుంచి నీటిని తరలించి సమస్య పరిష్కరించవచ్చన్నారు. అలాగే కామదేను ప్రాజెక్టులో వెటర్నరీ కళాశాల ఏర్పాటు చేస్తే ఐదు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఎంతో అనువుగా ఉండడంతోపాటు ప్రాజెక్టు అభివృద్ధి చెందుతుందన్నారు. స్పందించిన మంత్రి కామదేను ప్రాజెక్టు పరిస్థితిని తెలుసుకునేందుకు ఓ పరిశీలన కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. తాను స్వయంగా ప్రాజెక్టును సందర్శించి అభివృద్ధికి చర్యటు చేపడతామన్నారు.

# మృతుల కుటుంబాలకు కంచి ఆర్థిక సాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి చేయూతతో మరణించిన వారి కర్మకాండల నిమిత్తం 3కుటుంబాలవారికి 30 వేలు నగదును సోమవారం పంపిణీ చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ముగ్గురి కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి పరామర్శించి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 10వేల వంతున మొత్తం 30వేలు నగదును పంపిణీ చేశారు. సంవత్సరం పైగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి కర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న 10వేలు ఆర్థిక సహాయం కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో నిర్విరామంగా కొనసాగుతుంది. కంచి పరమేశ్వర రెడ్డి సోమవారం స్థానిక 3 వ వార్డు పరిధిలోని సయ్యద్ రహమతున్నీసా, 13వ వార్డు పరిధిలోని శాగలమూరి రవిచంద్ర, 14వ వార్డు పరిధిలోని నల్లమేకల మస్తానయ్యల కుటుంబాలను పరామర్శించి వారికి 10వేల రుపాయల వంతున అందజేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. మీ కుటుంబాలకు తానెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించాడు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఈనాడు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎందరో తమ లాంటి పేదవారి ఆకలిని తీరుస్తూ అదే కాకుండా మాకు 10వేల సాయం చేసిన నిత్యన్నదాత కంచి పరమేశ్వర రెడ్డికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ వారి యొక్క దాతృత్వానికి ఇంటి పెద్ద దిక్కుని కోల్పోయి రేపు పెద్దకర్మకాండ ఎలా చేయాలో అర్థం కాని పరిస్థితిలో మీ రాక మీ సహాయం మా చీకటి బ్రతుకుల్లో ఒక వెలుగు అని కన్నీటితో కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతూ బ్రతుకు జీవనం గడుపుతుంటే నేనున్నాను అంటూ మీరు ఈరోజు మాకు చేస్తున్న ఈ ఆర్థిక సహాయం ఇప్పుడున్న ఈ కష్టాల్లో మాకు ఎంత పెద్ద మొత్తమో అర్థమవుతుంది ఈ సహాయం మా జీవితకాలం గుర్తుపెట్టుకుంటామని, ఇదే కాకుండా ఈ కష్టకాలంలో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో డెత్ ఫ్రీజర్, కైలాస రధము, పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన మీకు జీవితకాలం రుణపడి ఉంటామని కన్నీటి పర్యంతమై ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆత్మకూరు పేద ప్రజల కష్టాలు తీర్చడానికి నేనున్నాను అంటూ మీరు మాకు అండగా నిలుస్తున్నారు మీలాంటి గొప్ప వ్యక్తి ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ఆ దేవుని ఆశీస్సులు మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని ఆ దేవుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లవరపు జయంద్ర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18వ వార్డులో ప్రజా చైతన్య యాత్ర



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని 18వ వార్డులో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. 18వ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజల వద్ద నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కొత్తగా పెళ్లి అయిన వారికి రేషన్ కార్డులు లేవని, అలాగే భర్తలను కోల్పోయిన మహిళలకు సంవత్సరం దాటినప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ రాలేదని ప్రజలు సమస్యలను తెలిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చే తొమ్మిది నెలల గడుస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. వెంటనే ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు గుల్జర్ బేగం, వినుకొండ పద్మ, సుమతి, రమణయ్య, గంధళ్ల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు మార్చి 5 నుండి కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన హాజరు వివరాలను అధికారులు వెల్లడించారు. సోమవారం ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షకు మొత్తం 3 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, అందరూ హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగవ సెమిస్టర్ పరీక్షకు 488 మంది విద్యార్థులకు గాను 452 మంది హాజరయ్యారు. 36 మంది గైహాజరు అయ్యారు. పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయని, విద్యార్థులు సూచించిన నిబంధనలను పాటించాలని పరీక్షల నిర్వాహణాధికారి డా. ఆర్.మధుమతి తెలిపారు.

## చేతి వృత్తిదారుల అవగాహనా సదస్సు నేడే

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదరణ-3 పథకంకు సంబంధించి బీసీ సామాజిక వర్గంలోని వివిధ సాంప్రదాయక కులవృత్తులను చేపడుతున్న కులాలకు సంబంధించిన నాయకులు, పెద్దలు మొదలైన వారితో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తామని ఆత్మకూరు ఎంపీడీఓ పి.ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో 18వ తేదీన మధ్యాహ్నం 3.00గంటలకు నిర్వహించబడుతుందన్నారు. ఈ సమావేశంలో సాంప్రదాయ కులవృత్తులకు సంబంధించిన ప్రజల యొక్క అర్హతలు, వారికి అవసరమైన పరికరాలు మొదలైన వివరాలను వారితో చర్చించి సమావేశంలో వ్యక్తపరచిన అభిప్రాయాలను బీసీ సంక్షేమ శాఖ అధికారులకు తెలియపరుస్తామని ఆయన పేర్కొన్నారు. కావున ఆయా సాంప్రదాయ కుల వృత్తులకు సంబంధించిన నాయకులు, పెద్దలు ఈ సమావేశంకు హాజరు కావలని ఎంపీడీఓ కోరుతున్నామని ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు.

## కోరిడ్ సంస్థ ఆధ్వర్యంలో టీచర్స్, వలంటీర్లకు శిక్షణ




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని బాపూజీ నగర్‌లో కావలి రూరల్ ప్రాంతాలలో కోరిడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేకమైన సేవలలో విద్య అనేది ప్రజలకు నిరక్షరాస్యులకు ఎంతో అవసరం ఈ అవసరాన్ని గమనించిన ఈ సమస్త వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.జైపాల్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాల్లో తను నేనున్నానని పేద ప్రజలకు సహాయ, సహకారాలు అందిస్తూ ప్రజల మనలను పొందుతున్న ఈ సమస్త దిన దినము ప్రవర్తమానమై వర్ధిల్లడం మనం చూస్తున్నాం. అంతేకాకుండా ఈ సంస్థ ద్వారా కావలి రూరల్ ప్రాంత ప్రజలకు ఎన్నో సేవలు ఉచిత మెడికల్ క్యాంపులు కంటి ఆపరేషన్లు నిర్వహించడం అందరికీ తెలిసిందే. ఆ విధంగా ఆ రీతిలోని కావలి రూరల్ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులకు అక్షరాభ్యాసం ఏ విధంగా చేయాలో పని సమస్త లో పనిచేస్తున్న వారికి శిక్షణా కార్యక్రమం వ్యవస్థాపకులైన ఆర్ జైపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్రీ స్టడీ సెంటర్‌ను నిర్వహించడం, ఈ స్టడీ సెంటర్లో నిరక్షరాస్యులకు ఏ విధంగా నాణ్యమైన విద్యను సులభ పద్ధతిలో ఏ విధంగా నేర్పించాలని శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొరిడ్ సంస్థ సూపర్వైజర్ డి.సునీల్ రాజ్, కోరిడ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు..

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలి



### ఎమ్మెల్సీ పర్వత రెడ్డి వెల్లడి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని సోమవారం ఏపీ శాసనమండలి సమావేశాలలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్మెంట్ ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. డిగ్రీ విద్యార్థులతోపాటు పీజీ విద్యార్థులు 40వేల మంది ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు. ఇంకా పెండింగ్‌లో ఉండటం వల్ల కళాశాలలో సర్టిఫికెట్లు కూడా తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరికీ ఎప్పటిలోగా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లిస్తారని ప్రశ్నించారు. పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు 4200 కోట్ల రూపాయలు ఈ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈరోజు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు అందక దాదాపుగా 13లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2వేల కోట్లు వసతి దీవెనకు హాస్టల్ ఫీజులు కూడా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో 2018-19కి సంబంధించి 1880 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఉంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత 2019-20 కి ఫీజు రీయింబర్స్మెంట్ నిధులతోపాటు పాత బకాయిలను కలిపి 4200కోట్ల రూపాయల ఒకేసారి జమచేయడం జరిగిందన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించిన ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వాటిని త్వరగా చెల్లించి.. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో జిల్లా పరిషత్‌లో హైస్కూల్, పాఠశాలలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నయాన్నారు. గత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేద గ్రామీణ ఆడపిల్లలకు అందుబాటులో జూనియర్ కళాశాల ఉండాలన్న సంకల్పంతో 292 హైస్కూల్, పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. హై స్కూల్ ప్లస్ పాఠశాలల మూలంగా అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీజీటీ లుగా ప్రమోషన్‌లు కల్పించామని తెలిపారు. తరువాత సంవత్సరం 2024లో మరో 210 కో ఎడ్యుకేషన్ పాఠశాలను హై స్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇందులో విద్యార్థులు చేరినప్పటికీ స్టాప్ నియామకాలు చేపట్టకుండా వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. తద్వారా చాలా మంది ఆడ పిల్లలు ఇంటర్ విద్యకు దూరమయ్యారని తెలిపారు. అయితే ఇప్పుడు పిల్లలు తక్కువగా ఉన్నారన్న కారణంగా జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న మొత్తం 502 హై స్కూల్ ప్లస్ పాఠశాలలనే రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. ఇది పేద విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో హైస్కూల్, పాఠశాలలుగా అయినా లేదా వాటిని జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా అయిన పేరు మార్చి అలానే కొనసాగించడంతోపాటు మిగిలిన 210 హై స్కూల్ ప్లస్‌లలో కూడా పీజీటీల నియామకం జరిపి, పేద, బడుగు, బలహీన గ్రామీణ విద్యార్థులకు ఇంటర్ విద్యను చేరువ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఎండలకు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రోజురోజుకి ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వివిధ రంగాల్లో పనిచేసే కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వేసవి తీవ్రత దృష్ట్యా వివిధ ఇంజనీరింగ్ శాఖలు, డ్వామా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలను ఎండ వేడి ప్రభావం నుంచి రక్షించేందుకు అన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఉచిత నీటి కియోస్కు ఏర్పాటు చేయాలన్నారు. కూలీలను, నిర్మాణ కార్మికులను మధ్యాహ్నం సమయంలో పని చేయకుండా చూడాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు వాడగాల్పుల హెచ్చరికలను ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు. పని ప్రదేశాల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇటుక బట్టీలు వంటి ఆరుబయట పని చేసే ప్రదేశాల్లో రోజువారీ కార్మికుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత యాజమాన్యాలకు సూచించవలసిందిగా కార్మిక శాఖ అధికారిని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కూలీలు, కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. హీట్ స్ట్రోక్ నివారణ కోసం చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో హీట్ స్ట్రోక్ చికిత్స కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు హీట్ స్ట్రోక్ లక్షణాలు, నివారణ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా మూగజీవాలను సైతం ఎండల వేడిమి నుండి రక్షించేందుకు పశు సంవర్ధక అధికారులు కృషి చేయాలన్నారు. వాటి సంరక్షణ విషయమై సంబంధిత పశు పోషకులు, రైతులకు



అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశం లో ఆర్ డబ్ల్యూ ఎస్‌ఎస్‌ఈ వెంకట రమణ, డిఆర్ఓ ఉదయ భాస్కర్ రావు, డ్వామా పిడి గంగా భవాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మహిళా రైతులను ఆదుకోండి : కాంగ్రెస్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మహిళలు తాము పండించిన పంటలను రోడ్లపై అమ్ముకోలేక అవస్థలు పడుతున్న మహిళా రైతులకు జీవన భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా, సిటీ జనరల్ సెక్రెటరీలు కే.సంజయ్ కుమార్, సుధీర్ వినతిపత్రం అందించారు. సిటీ అధ్యక్షులు నెల్లూరు సిటీలోని మహిళా రైతుల అవస్థలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడాలని, 2014లో యూపీఏ ప్రభుత్వం రోడ్లపై చిరువ్యాపారం చేస్తున్న వారికి భద్రత జీవనోపాధి కల్పించకై చట్టం తీసుకువచ్చినా, శ్రద్ధతో అమల్లోకి తీసుకురావాలని కలెక్టర్‌ని కోరారు. దశాబ్దాలుగా చిన్న సన్న కారు మహిళా రైతులు చుట్టుపక్కల ఉన్న పల్లెల నుండి తాము పండించిన ఆకుకూరలు కాయగూరలు పొట్టకూటి కోసం, కుటుంబ పోషణ నిమిత్తం ఎంతో వ్యయ ప్రయాసలతో రాత్రంతా ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ రోడ్లమీద చీత్కారాలు, వేధింపులు మధ్య తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, రూరల్ ఇంచార్జ మల్లికార్జున్‌రెడ్డి మాజీ జిల్లా మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లావుద్దీన్, సేవాదళ్ సుజాత, సిటీ నాయకులు ధనుంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్రి, ఫజల్, బక్షు నదీమ్ శ్రీను, హనీఫ్, సమీర్ సిటీ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు సుస్మిత రెడ్డి, డాక్టర్ ప్రసాద్ నాగిరెడ్డి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంట కాలువలో విద్యుత్

# స్తంభాల ఏర్పాటుపై ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో పంట కాలువలో విద్యుత్ స్తంబాలపై ఏర్పాటుపై సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గ్రామానికి త్రిఫేజ్ విద్యుత్ సరఫరాలో భాగంగా ఉదయగిరి పెద్ద చెరువు నుంచి సాగునీరు సరఫరా చేస్యే పంట కాలువలో విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ పంట కాలువ కింద 60 ఎకరాలు సాగులో ఉందన్నారు. స్తంభాల ఏర్పాటుతో సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని రైతులు వాపోయారు. స్తంభాలు ఏర్పాటు చేయవద్దని సంబంధిత అధికారులు తెలిపినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్తంబాలను మరోచోట ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## ప్రసన్న వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన హుండిల లెక్కింపు కార్యక్రమం సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.రాధాకృష్ణయ్య అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారిగా గండవరం గ్రూపు కార్యనిర్వహణాధికారి కే.ఉమాబాయి, దేవస్థానం సిబ్బంది, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, కావలి బ్రాంచ్ మేనేజర్ ఏ.లక్ష్మి నారాయణ, బ్యాంకు సిబ్బందితోపాటు వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ.. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఏడు రోజులు పాటు జరిగిన బ్రహ్మోత్సవాలలో భక్తులు మొక్కుబడితో వేసిన కానుకలు హుండీ ఆదాయం రూ.22,14,579 రూపాయలు వచ్చిందని, 2024 సంవత్సర బ్రహ్మోత్సవాలలో రూ.16,39,801 వచ్చిందని తెలిపారు. 2024 సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం హుండీ ఆదాయం రూ.5,74,778 రూపాయలు ఎక్కువ వచ్చిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## యోగి వేమన విశ్వవిద్యాలయానికి

## ఇన్‌చార్జ్ వైస్-చాన్స్‌లర్‌గా ఆచార్య అల్లం శ్రీనివాసరావు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్ వైస్-చాన్స్‌లర్‌గా ఆచార్య అల్లం శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్-చాన్స్‌లర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను యోగి వేమన విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు గవర్నర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చేతులు మీదుగా విడుదలయ్యాయి. కొత్త నియామకం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అమలులో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మహిళలు, బాలికల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం

## జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** మహిళలు, బాలికల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ తెలిపారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు శక్తి యాప్ గురించి కరపత్రాలను ఆవిష్కరించి, మహిళలకు స్వయంగా అందజేసి, శక్తి మొబైల్ యాప్‌ను స్వచ్ఛందంగా డౌన్లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన శక్తి యాప్ ప్రతి మహిళ తప్పక డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. శక్తియాప్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల విపత్కర పరిస్థితులలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రక్షిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్ లో యాప్ ను నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు క్లుప్తంగా వివరించాలన్నారు. సమాజంలో వివిధ రకాల నేరాలు జరిగినప్పుడు వెంటనే శక్తి యాప్‌తోపాటు 100, 112, 1930, 1972, 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించిన ఫలితంగా ఆపదలో ఉన్న వారికి పోలీసులు అండగా నిలుస్తారని తెలిపారు.

## ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన

# పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** దేశంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం లోకసభలో పలు అంశాలపై ఆయన ప్రశ్నలు వేశారు. పిడబ్ల్యుసి సర్వే ప్రకారం దేశం ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్న విషయం వాస్తవమేనా అని ఆరా తీశారు. అయితే 2020లో 4వ స్థానం నుండి 2022లో 5వ స్థానానికి, 2023లో 9వ స్థానానికి పడిపోయిన కారణంగా ప్రభుత్వం ఈ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి, ఈ ర్యాంకును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు విధానపరంగా తీసుకుంటున్న చర్యలు, అదనపు మూలధన వ్యయం, దేశీయ డిమాండ్ ఈ విషయంలో ఎంత వరకు సహాయపడతాయో తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పన్నుల చర్యలతో సహా దేశీయ డిమాండ్‌ను పెంచడానికి, తద్వారా దేశీయ వినియోగం, పొదుపులు, పెట్టుబడులను పెంచడానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టబడ్డాయని వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం తాళ్ళూరు గ్రామ సమీపం వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై పడి ఉన్న ఇరువురిని స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా కావలి ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు జలదంకి మండలం బ్రాహ్మణక్రాక చెందిన వారిగా స్థానికులు గుర్తించారు.